విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 20, జనవరి 2025

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు...

జేబులు నింపుకుంటున్న అధికారులు

విశాలాంధ్ర - డోన్ రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు హద్దే ఉండదు. ఈ పనుల్లో ఇటు ఉపాధి సిబ్బంది అటు రాజకీయ నేతల హవా నడుస్తోంది. తిలా పాపం తల పిడికెడు అన్నట్లుగా ఉపాధి హామి పనులు కొనసాగుతున్నాయి. అనేక గ్రామాలలో జరిగే ఉపాధి పనులలో ఏపీవోలతో పాటు సోషల్ అడిట్ టీం సభ్యులు ఉపాధి పనుల్లో జరిగే అవినీతి అక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారు. అవినీతి అక్రమాలను నిగ్గు తేల్చాల్సిన వారు కాసుల వేటలో విధులు మరచి జేబులు నింపుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు అవినీతిలో పాలుపంచుకుంటున్నారు. ఉపాధి సిబ్బంది 50% పైగా దొంగ మస్టర్లు వేస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ గ్రామాలలో ఉపాధి పనులను యంత్రాలతో చేపట్టి దొంగ మస్టర్ల ద్వారా నిధులను స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధినిధులతో పండ్లతోటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ వందలాది ఎకరాల్లో పండ్ల తోటల అభివృద్ధి జరిగినట్లు కాగితాల పై కనిపిస్తున్న ఈ గ్రాఫ్‌లో మాత్రం విస్తీర్ణం పెరగడం లేదని ఆరోపణలు వ్యక్తమ వుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పనులలో, కొలతలలో అవినీతికి ఆజ్యం పోస్తున్నారు.

తూతూ మంత్రంగా తనిఖీలు ..

ఉపాధి నిధులతో చేపట్టే పనుల్లో 99 శాతం పనులను సోషల్ ఆడిట్ టీంలు పరిశీలించి అక్రమాలను వెలికి తీయాలి. ఒక్క శాతం క్వాలిటీ కంట్రోల్ విభాగం తనిఖీ చేస్తుంది. గ్రామీణ అభివృద్ధి జారీచేసిన మార్గదర్శకాల మేరకు సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి పనులకు వెళ్లిన ప్రతి ఒక్కరిని కలవాలి. కలిసిన వారిని విచారించి ఎన్ని రోజులు పనులకు వెళ్లారు. వేతనం ఎంత వచ్చిందని వివరాలు సేకరించాలి.

అధికారులు విందులను ఆరగిస్తూ..

గ్రామానికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చే విందులను స్వీకరించి తూతూ మంత్రంగా కొలతలు వేస్తున్నారు. ఒకరిద్దరు చెప్పిన సమాచారం మేరకు గ్రామం మొత్తానికి అన్వయిస్తున్నారు. నిబంధనల ప్రకారం గ్రామంలో సోషల్ ఆడిట్ నిర్వహించిన తర్వాత గ్రామసభ నిర్వహించాలి. కానీ గ్రామ సభలు జరుగుతున్నట్లు గ్రామాల్లో ఎవరికి తెలియదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకొని ఉపాధి పనుల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని మండలంలోని గ్రామస్తులు కోరుతున్నారు.

పనిదినాలు పెంచుతాం : సుకూర్ ఏపీవో

మండలంలోని గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామని ఏపీవో తెలిపారు. మస్టర్లు, ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు లేకుండా చూస్తామని, రాబోవు కాలంలో పనిదినాలు పెంచుతామని ఆయన తెలిపారు.

అమిత్‌షా గోబ్యాక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సమావేశాలలో భారత రాజ్యాంగ నేత బిఆర్ అంబేద్కర్ ను అవమానించే విధంగామాట్లాడినందుకు క్షమాపణలు చెప్పాలని, నిసిగ్గుగా రాష్ట్రంలో పర్యటించడం రాష్ట్ర ప్రజలను అవమానపరచడమేనని హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఐ నంద్యాల సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు డి. శ్రీనివాసులు అధ్యక్షతన సంజీవ్ నగర్ గేట్ వద్ద నిరసన కార్యక్రమం తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో కార్పొరేట్ సంస్థలైన అంబానీ ఆదానిలకు ఊడిగం చేస్తూ భారత రాజ్యాంగాన్ని తిరిగి రాయాలని ప్రయత్నాలు చేయడం దుర్మార్గ చర్యని, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నేత అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా మాట్లాడడం జరిగిందని, తక్షణమే కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని, బిజెపి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, మరోసారి ఇలాంటి ఘటనలు, మాటలు మాట్లాడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఆర్. సామేలు,సిపిఐ గోస్పాడు మండల సహాయ కార్యదర్శి ఎస్ జిలాని భాష, సలీంనగర్ శాఖ కార్యదర్శి భూముని శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి కొమ్ము సుబ్బరాయుడు, నాయకులు ఆదాం,స్టాలిన్, జమాల్ కరీమ్, సలీం, రసూల్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ కార్యకర్త మారెళ్ళ మస్తాన్ మృతి

విశాలాంధ్ర -డోన్ : సీపీఐ సీనియర్ సభ్యులు మారెళ్ళ మస్తాన్ గుండెపోటుతో హైదరాబాద్ లో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు. ఆదివారం ఉదయం డోన్ పట్టణం చిగరమాను పేటలో మారెళ్ళ మస్తాన్ ఇంటిదగ్గర సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య, జిల్లా సమితి సభ్యులు ఎస్.పులి శేఖర్, డోన్ మండల సహాయ కార్యదర్శి బి.వరదరాజులు, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి జి .అబ్బాస్ మృతదేహంపై సీపీఐ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ సీనియర్ సభ్యులు మారెళ్ళ మస్తాన్ గత అనేక సంవత్సరాల నుండి సీపీఐ కార్యకర్తగా.... సీపీఐ చేసే అనేక పోరాటంలో పాల్గొనే వాడన్నారు. ఆనాటి ఉమ్మడి జిల్లాలో చదువుల రామయ్య స్వగ్రామం మారెళ్లలో అప్పుడు జరిగిన భూస్వామ్య పెత్తందారి వ్యతిరేక పోరాటంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండటం నాటి నుండి నేటి వరకు పార్టీని అంటిపెట్టుకొని నడుచుకోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఏమైనా అకస్మాత్తుగా మరణించడం బాధాకరం ఈ సందర్భంగా మారెళ్ళ మస్తాన్ కుటుంబానికి సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.

సీపీఐ జిల్లా సమితి సంతాపం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సీనియర్ సభ్యులు అమరజీవి చదువుల రామయ్య సహచరుడు, మరెళ్ల మస్తాన్ నిన్న రాత్రి ఆకస్మికంగా మృతి చెందడం పట్ల సీపీఐ నంద్యాల జిల్లా సమితి తరుపున సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు, ప్రగాఢ సానుభూతిని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు, డోన్ సిపిఐ పట్టణ కార్యదర్శి మోట రాముడు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుగ్గలి మండలం మారెళ్ళ గ్రామంలో జన్మించి చదువుల రామయ్య స్ఫూర్తితో పత్తికొండ, డోన్ నియోజకవర్గం లో భూస్వామ్య పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కామ్రేడ్ చదువుల రామయ్య సహచరుడుగా ఆయన వెంట ఉండి.పార్టీ విస్తరణకు పార్టీ సభ్యుల్లో కష్ట,నష్టాలకు వారి యోగ సమాచారాలను పార్టీ కి అందించేవాడన్నారు. మంచి కమ్యూనిస్ట్ సభ్యులు అని వారు అన్నారు. డోన్ పట్టణంలో జరిగిన రుద్రాక్ష గుట్ట పోరాటంలో కామ్రేడ్ మారెళ్ళ మస్తాన్ ముందుండి వ్యక్తి అని వారు కొనియాడారు. పార్టీ రాజకీయంగా ఏ అంశం ఇచ్చిన పార్టీ నిర్ణయాన్ని తూచా తప్పకుండా అమలు చేసే గొప్ప కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త మృతి చెందిన పార్టీకి తీరని లోటు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

భారీగా తగ్గిన దిగుబడి

- ఎకరాకు క్వింటాం మాత్రమే..
- తెగుళ్లు, అధిక వర్షాలే కారణమంటూ ఆవేదన
- గిట్టుబాటు ధర లేక మినుము రైతులు విలవిల

విశాలాంధ్ర - చాగలమర్రి : ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసే అన్న దాతలకు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టాలను చవిచూస్తున్నారు. నెల తిరగక ముందే మూడు తుఫాన్లు రావడంతో అన్నదాత కుదేలయ్యాడు. మండలంలో మినుము పంటను రెండు వేల ఎకరాల్లో సాగు చేశారు. 90 రోజుల పాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఒక్కొక్క రైతు రెండుసార్లు మినుము విత్తనం వేశారు. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడి పెట్టారు. దిగుబడి మాత్రం ఎకరాకు క్వింటా నుంచి రెండు క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని లబోదిబోమంటున్నారు. ధర కూడా త గ్గిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది క్వింటా మినుము ధర రూ.9 వేలు నుంచి రూ.12 వేలు దాక పలికిందని, ఈ ఏడాది రూ. ఐదు వేలు నుంచి రూ.ఆరు వేలు దాక తగ్గింది. మినుములు కూడా నాసిరకంగా ఉన్నాయని, వ్యాపారులు కొనడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు మిను ము పంటను కోత కొయ్యకుండానే వదిలేశారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా క్వింటా దిగుబడి మాత్రమే రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తెగుళ్లు, అధిక వర్షాలతో మినుము పంట దెబ్బతిని భారీ నష్టం మిగిల్చిందని రైతులు విలపించారు. పండిన పంటకు ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయా...

రఘురామయ్య రైతు, రాంపల్లె

15 ఎకరాల్లో మినుము పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయా. పెట్టిన పెట్టు బడి చేతికందలేదు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.40 వేలు దాక పెట్టుబడి పెట్టా. దిగుబడి తగ్గింది. ధర లేకపోవడంతో నష్టపోతున్నాం. మినుము పంట ఈసారి రైతులను నట్టేటా ముంచింది.

కూలీల డబ్బులు కూడా రాలేదు...

లక్ష్మీదేవి మహిళారైతు, రాంపల్లె

ఐదు ఎకరాల్లో మినుము పంట సాగు చేశా. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. ఎకరాకు 2 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. తుఫాన్ దెబ్బతో పంట దెబ్బతినింది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ధర లేక నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

రహదారి పక్కన కంప చెట్లు

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : ప్రజల సౌకర్యార్థం వాహనదారుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం గుంతలు లేని రహదారులపాటు రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించేందుకు పనులు చేపట్టింది. చాలావరకు పనులు కూడా పూర్తి చేసింది.అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మండలంలో కూడా రహదారుల గుంతలకు ప్యాచ్‌లు వేసిన రహదారులకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను మాత్రం పూర్తిగా తొలగించకుండా వదిలేశారు.దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. తిమ్మానాయుని పేట, అంకిరెడ్డిపల్లి వెళ్లే రహదారిలో చింతలాయపల్లి మదనంతపురం మధ్య లో రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను పూర్తిగా తొలగించకుండా వదిలేశారు. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఒకే వరుస రహదారి కావడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రెండు వాహనాలు ఎదురైనప్పుడు పొదలుగా అల్లుకున్న రేగు కంప చెట్లు తగులుతూనే ఉన్నాయి. ఆటోలు ద్విచక్ర వాహనాలలో వెళ్లే వారు కంప చెట్ల చూసి బెంబేలెత్తుతున్నారు. రహదారికి ఒకవైపు మాత్రం పూర్తిగా కంపచెట్లను తొలగించిన మరోవైపు మాత్రం అసంపూర్ణంగా వదిలేసారు. ఈ రహదారిని కొత్తగా రెండు వరుసల రహదారిగా నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతోనే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అసంపూర్ణంగా పనులు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పూర్వ విద్యార్థులు సమ్మేళనం

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. 2006-2008 ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకొని నేటి జీవితంలో ఏవృత్తిలో సంబంధిత ఉద్యోగాలలో వారి జీవనం సాగిస్తున్నారని అంశాలలో చర్చించుకొని తోటి స్నేహితులను చూసి ఒకరికొకరు అలింగనం చేసుకొని తరగతి గదిలో చేసిన అల్లర్లను జ్ఞాపకం చేసుకొని సంతోషంతో ఉప్పొంగిపోయారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను, లైబ్రేరియ న్‌లను సన్మానించి, పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పూర్వపు విద్యార్థి,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యాగంటిలో కమలాపురం ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని యాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారిని కమలాపురం శాసనసభ్యులు పుట్టా కృష్ణచైతన్య రెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమము నందు ఆలయ ఈఓ చంద్రుడు, యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌళీశ్వర రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

LOST OF PASSPORT

Lost my original INDIAN PASSPORT No. L8371990, date. 11/04/2014, Issued at HYDERABAD and Expiry date 10/04/2024, The said lost of my Passport while going to Xerox Center Travel Near byrmal street, Nandyal, Dated 20/12/2024, if any one founded send to NAGINENI RAJANI KANTH, H.NO : 3/99A, Byramal Street, Nandyal, Cell No 9573896630.

చెరువులను మింగిన ఘనులు

- కన్నెత్తి చూడని సంబంధిత అధికారులు
- ఆక్రమణ భూమిలో పండ్ల తోటల పెంపకం
- అందుకు సహకరించిన అధికారులు
- కట్టను తెంచి ఆక్రమణ భూమికి దారి ఏర్పాటు
- తెలిసినా తెలియదన్నట్లు అధికారుల తీరు

విశాలాంధ్ర - రుద్రవరం : పూర్వం రాజులు గ్రామ పెద్దలు గ్రామస్తులు వ్యవసాయ రైతులు వారి పశువులకు, పంట పొలాలకు త్రాగునీటికి ఏర్పాటు చేసేందుకు గ్రామాలకు సమీపాలలో వందలాది ఎకరాల భూములను చదును చేసి చెరువులా మార్చి దాని చుట్టూ రాతి కట్టను బలంగా వేసి నేటికీ చెక్కు చెదరకుండా ఏర్పాటు చేశారు. అప్పటినుండి ఇప్పటివరకు గ్రామస్తులు వారి భూములకు మూగజీవాలకు తాగు నీటితోపాటు సాగునీరును పారించుకొని భూములను చదును చేసి పంటలు పండించుకుంటున్నారు. అయితే నేడు కొందరు ధనవంతులైన భూ బకాసురులు ఏకంగా చెరువులపై కన్నేసి పదుల సంఖ్యల ఎకరాల భూమిని ఆక్రమించుకొని మట్టిని తీసి ఆక్రమిం చుకున్న భూమికి కట్టలుగా పోసి అదిచాలదు అన్నట్లు చెరువు కట్టనే తెచ్చి వారు ఆక్రమించుకున్న పొలంలోకి రగదారిని ఏర్పాటు చేసుకున్న దుస్థితి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రం రుద్రవరానికి అతి సమీ పంలో దాదాపు 200 ఎకరాలలో రంగారెడ్డి చెరువు ఉంది. ఆక్రమణ బకాసురుల దెబ్బకు నేడు దాదాపు 70 - 80 ఎకరాలకు మాత్రమే చెరువులో నీరు నిలువ చేరింది. మిగిలిన భూమి బకాసురుల చేతుల్లోకి వెళ్లిందంటూ పలువురు ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణ భూమిలో సంబంధిత అధికారుల అండదండలతో ఏకంగా పండ్లతోటల సాగును చేస్తున్నారు. అది చాలదన్నట్లు చెరువు కట్టను యంత్రాలతో నరికి ఆక్రమణ భూమికి రహదారిని ఏర్పాటు చేసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులోని భూమిని రాజకీయ ధన బలం ఉన్నవారు ఆక్రమించుకోవడంతో అధికారులు తెలిసినా ఊరుకున్నారా, ముడుపులు తీసుకొని అటువైపు కన్నెత్తి చూడలేదా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటినుండి ఇప్పటివరకు ఏ అధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇదే నిజం అన్నట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువులను ఆక్రమించుకుంటున్న వారిపై అలాగే చెరువు కట్టలను తెంచి వారు ఆక్రమించుకుంటున్న భూమిలోకి రహదారులను ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకొని చెరువులను నమ్ముకొని పంటలు సాగు చేస్తున్న సామాన్య రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

చెరువు కట్టను తెంచిన వారిపై చర్యలు

ఎమ్ఐ.ఏఈ రఘురాం

రుద్రవరానికి సమీపంలో ఉన్న రంగారెడ్డి చెరువు కట్టను తెంచి వారి భూములకు రహదారిని ఏర్పాటు చేసుకున్న విషయంపై పరిశీలించి విచారించి కట్టను నరికిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

ఉద్యమానికి ఆజ్యం పోయద్దు

రాయలసీమ వనరుల వినియోగానికి సహకరించండి

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పోలవరం ప్రాజెక్టు , అమరావతి, విశాఖ ఉక్కులకు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులను, విశాఖ రైల్వే జోన్ ను సాధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించి సఫలీకృతులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదే చిత్తశుద్ధితో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నుంచి రావలసిన నిధులను, ప్రాజెక్టులను సాధించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నంద్యాల పట్టణం వివేకానంద ఆడిటోరియంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో తుంగభద్ర, కృష్ణా జలాల సంరక్షణ - అభివృద్ధి అంశంపై ప్రతినిధుల సమావేశం జరిగింది. సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడారు. ప్రతి ఏటా కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి కొన్ని వందల టియంసిల నీళ్ళు శ్రీశైలం దాటి దిగువకు పోతున్నాయని ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించారనీ, ఇదే సందర్భంలో కృష్ణా నది ఎండిపోయిందనీ, నదిలో నీళ్ళు లేవని చెబుతూ గోదావరి నుంచి బనకచర్లకు నీటిని మళ్ళిస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ఆయన ఎద్దేవా చేసారు. హక్కుగా వున్న నీటిని రాయలసీమ ఏనాడు పూర్తిగా వాడుకోలేదనీ అందుకు కారణం దశాబ్దాల కింద మొదలు పెట్టిన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కాకపోవడం, ప్రాజెక్టుల కింద వున్న ప్రధాన కాలువల అసంపూర్ణ నిర్మాణాలు, పంట కాలువల మరమ్మత్తులు నోచుకోకపోవడమేనని ఆయన విమర్శించారు. తుంగభద్ర, కృష్ణా జలాల సద్వినియోగానికి కార్యాచరణ చేపట్టకుండా, పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అని, గోదావరి నుండి బనకచర్లకు నీళ్ళు తెచ్చి ప్రతి ఒక్క ఎకరాకు నీరు అందిస్తామని చెప్పడం రాయలసీమ ప్రజలను మభ్యపరచడమేనని స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న వెనుకబడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ సాధించకుండా, కడప ఉక్కు,కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం, రాష్ట్ర విభజన చట్టంలోని జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయాలను రాయలసీమలో ఏర్పాటు చెయ్యకుండా, రాయలసీమలో ఉన్న విద్యుత్తు నియంత్రణ కార్యాలయం, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తదితర కార్యాలయాలను అమరావతికి తరలించాలనే ప్రయత్నం రాయలసీమ ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు రాయలసీమ సమగ్రాభివృద్ధికై చేపట్టవలసిన కార్యాచరణను ప్రకటించాలనీ, ప్రజల హృదయ స్పందన అయిన సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సామాజిక రాయలసీమ పార్టీ నాయకులు డాక్టర్ నాగన్న, కెడిసిసి డైరెక్టర్ బెక్కం రామసుబ్బారెడ్డి, మహమ్మద్ పర్వేజ్, ఏరువ రామచంద్రారెడ్డి, సౌదాగర్ ఖాసీం మియా, మాజీ సర్పంచులు రామగోపాల్ రెడ్డి, వుశేని, జూపల్లె గోపాల్ రెడ్డి, కొమ్మా శ్రీహరి, రవికుమార్, పట్నం రాముడు, గాయకుడు గౌడ్, జనార్ధన్ రెడ్డి, ఆకుమల్ల రహీం, లాయర్ కృష్ణారెడ్డి, వివిధ మండలాల నుంచి రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : నేటి నుంచి కోవెలకుంట్ల మండలంలోని పలు గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశు వైద్య అధికారి కృష్ణకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులు, నట్ల నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. పశువులకు వ్యాధి నివారణ టీకాలు, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు మొదలగు వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అందులో భాగంగానే ఈనెల 21 కలుగొట్ల, 22 బిజినవేముల, ఆమదాల, 23 వెలగటూరు, 24 చిన్న కొప్పెర్ల, సౌదరదిన్నె, 25 కోవెలకుంట్ల, పెద్ద కుప్పెర్ల 27 గుల దుర్తి, లింగాల, 28 వల్లంపాడు, పొట్టిపాడు, 29 భీమునిపాడు, జోలదొరసి, 30 గుంజలపాడు, 31 కంపమల్ల గ్రామాలలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సిమెంట్ లారీ స్కూటీ ఢీ.. యువకుడు మృతి

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోవెలకుంట్ల పట్టణం చెందిన దూదే కుల బాబు 41సం మృతి చెందాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం బనగానపల్లెకు స్కూటీపై వెళ్లి తిరిగి కోవెలకుంట్లకు వెళుతుండగా కోవెల కుంట్ల నుండి సిమెంట్ ప్లేయర్స్ లారీ స్కూటీని ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రజా సమస్యలను వెలికి తీసే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర - వెలుగోడు : ప్రజా సమస్యలను, నిజాలను నిర్భయంగా వ్రాసే దినపత్రిక విశాలాంధ్ర అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. వెలుగోడు పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో విశాలాంధ్ర దినపత్రిక క్యాలెండర్‌ను ఆదివారం సాయంత్రం విలేఖరి రఘురాముడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిలా ఉంటూ విశాలాంధ్ర దినపత్రిక అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం దిశగా చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి వెలుగోడు పట్టణ అధ్యక్షుడు ఖలీల్ ఖాన్ , సీనియర్ నాయకుడు మండ్ల శంకర్ రెడ్డి, మైనార్టీ జిల్లా నాయకులు డాక్టర్ జాకీర్ హుస్సేన్, బీసీ నాయకుడు రమణ , రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, సుంకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ,ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ ఆదేశాల మేరకు ఆత్మకూరు సిఐ రాము మరియు ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి, పోలీసు సిబ్బందితోపాటు సిద్ధపురం గ్రామం ఫారెస్ట్ నందు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించగా సుమారు 16 డ్రమ్ములలో 3000 లీటర్ల సారా ఊట పట్టుబడింది. సారా ఊటను ధ్వంసం చేసి అక్కడ ఉన్నటువంటి సుమారు 30 లీటర్ల నాటు సారా ను సీజ్ చేశారు. పోలీసులను చూసి సారా కాస్తున్న నిందితులు సిద్దాపురం గ్రామం నుంచి పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న షేక్ బేగం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల కోఆర్డినేటర్ షేక్ బేగంకు జాతీయస్థాయి ప్రతిభ అవార్డును దక్కించుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ సావిత్రి భాయి పూలే జాతీయ అవార్డుకు షేక్ బేగంను ఎంపిక చేశారు. విజయవాడలోని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు డాక్టర్ పి. నాగయ్య ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభ అవార్డును ఆమెకు గుంటూరులోని ఏసి కాలేజ్ అసెంబ్లీ హాల్‌లో అందించారు. అవార్డు పంపిణీ కార్యక్రమంలో సభ అధ్యక్షులుగా ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ముఖ్య అతిధులుగా ఏఎన్ యు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ వి. కన్న మాస్టార్, అప్పుస్మా రాష్ట్ర కోశాధికారి కాటూరి వెంకటేశ్వరరావు, ఏపీఎస్పీ ఎస్సీ రాష్ట్ర కౌన్సిల్ కో-చైర్మన్ మేకల రవీంద్రబాబు హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా గుంటూరు ఎ.సి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మోజెస్, వైస్ ప్రిన్సిపాల్ పి. రాణి అమృత వర్షిణి పాల్గొన్నారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా విద్యార్థులకు ఉత్తమ బోధన అందించారని తెలిపారు. గత 10 ఏళ్లుగా శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కోఆర్డినేటర్ గా విధులు నిర్వహిస్తూ ఉత్తమ విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఉత్తమ బోధన అందించారని అన్నారు. పూలే జాతీయ అవార్డు అందుకున్న షేక్ బేగంను పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డితో పాటు గురురాజా ఉపాధ్యాయుల బృందం ప్రత్యేకంగా అభినందించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 20, జనవరి 2025

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - పత్తికొండ : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు,ఏ.ఈశ్వర్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎస్. కృష్ణయ్య సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమ లింగప్ప,లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం రాజప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికుల పాలిట శాపంగా ఉన్న జీవో నెంబర్ 21,31 లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. ఆటో కార్మికులపై రోజు రోజుకి పోలీస్, ఆర్టిఏ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, అక్రమ్ భాష, రఫీ, రామాంజనేయులు వీరేష్, హరి, విజయ్, వీర బాష, లక్ష్మన్న, ఉచ్చన్న ,ఓబన్న, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతుల కొరత
ఉన్నతాధికారుల వైఫల్యమే..!

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : కర్నూల్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మౌలిక వసతుల కల్పించుటలో ప్రభుత్వాలు కావడం వలన ప్రవేట్ హాస్పిటల్స్‌కి వరంగా మారిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు విమర్శించారు. ఆదివారం నాడు స్థానిక సీఆర్ భవన్ నందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు,నగర కార్యదర్శి బిసన్నలు మాట్లాడుతూ కర్నూల్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల సమస్యలకు నిలయంగా మారిందని, ముఖ్యంగా క్యాజువాలిటీలో (అత్యవసర విభాగంలో) స్ట్రెక్చర్స్ కొరత, బెడ్ల కొరత అధికంగా ఉందన్నారు. యాక్సిడెంట్లు, క్రిమిసంహారక మందులు సేవించిన, కుక్క కాటుకు గురైన, కాలిన రోగులకు అత్యవసర చికిత్స సేవలు అందించలేకపోతున్నారని, అవసరం ఉన్న రోగులు అత్యవసర చికిత్స విభాగానికి వస్తే స్ట్రెక్చర్ కోసం అధిక సమయము వెయిట్ చేయవలసి వస్తుందని అన్నారు.అత్యవసర చికిత్స విభాగాన్ని గ్రీన్, ఆరెంజ్, రెడ్ జోన్ లుగా విభజించారన్నారు. సీరియస్ కేసులు ఉన్న రోగులు అధిక సమయం వెయిట్ చేయలేక మరియు సరైన సమయానికి వైద్యం అందక పోవటం వలన ప్రైవేట్ హాస్పిటల్స్ కు తరలి వెళ్ళిపోతున్నట్లు వారన్నారు. డబ్బులు చెల్లించలేని వారు రక్త గాయాలతో గంటలు తరబడి అత్యవసర విభాగాల్లో బాధను భరించవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు .హాస్పిటల్ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పే హాస్పిటల్ ఉన్నతాధికారులు చిన్న చిన్న మౌలిక వసతులు కల్పించుటలో ఎందుకు విఫలమవుతున్నారో సమాధానం చెప్పాలనివ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కృష్ణ, బాబయ్య, రామంజి గౌడ్, రవి, శివ, రాంబాబు, మహేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన గొప్ప దార్శనికులు, సంఘ సంస్కర్త
జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా..

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : తెలుగు సమాజాన్ని చైతన్య పరిచిన యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికులని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదివారం యోగివేమన జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో, అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలు అన్ని తరాల ప్రజలు అంగీకరించడం ఆయన రచనల గొప్పతనం అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డిఆర్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడి చిరంజీవి, ఇంచార్జ్ సిపిఓ భారతి, ఇంచార్జ్ సెట్కూరు సీఈవో దీప్తి,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పరిసరాలు శుభ్రత మనందరి బాధ్యత అన్న నినాదంతో స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కపటి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మాన్ని ఉద్దేశించే గురుచే కృష్ణమ్మ మీడియాతో మాట్లాడుతూ ఇంటి చుట్టూ ఉండే పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని వర్ణించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పాలుపంచు కున్నారు. మాజీ ఎంపీపీ మురళి, ఓంకార్,మహాదేవ,రవి, రాజశేఖర్, చిరంజీవి, బాబురావు,దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా గోబ్యాక్.. గోబ్యాక్
కేంద్ర హెూం శాఖ మంత్రి బహిరంగ క్షమాపణలు చెప్పాలి : వామపక్షాల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత భారతదేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ని పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హెూం శాఖ మంత్రికి ఆంధ్రప్రదేశ్ పర్యటించే అర్హత లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య విమర్శించారు. ఆదివారం అమిత్‌షా ఆంధ్ర రాష్ట్ర పర్యటన నిరసిస్తూ గోబ్యాక్ అమిత్ షా నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ప్లేకార్డ్స్ పట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ కర్నూల్ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దాని అనుబంధమైన బిజెపి పార్టీలు మొదటినుండి భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగ స్థానంలో వారి చీకటి అజెండా అయిన మన ధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని ఉద్దేశంతో పార్లమెంట్ సాక్షిగా ఉద్దేశపూర్వకంగా బాబాసాహెబ్ అంబేద్కర్ని అవమానపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అమిత్‌షా వ్యక్యాల పై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు దేశ ప్రజలు తీవ్ర ఆందోళన చేస్తా ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ స్పందించక పోగా అమిత్‌షాకి సపోర్ట్ గా వ్యవహరించడం తగదన్నారు. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకి బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతనే రాష్ట్రంలో పర్యటించాలన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ , ప్రతిపక్ష పార్టీలు అమిత్ షాకు సాగిల పడడం మానేసి అంబేద్కర్ అవమానించిన అమిత్‌షా చేత క్షమాపణ చెప్పించే విధంగా వారి వ్యవహార శైలి ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథంలు మాట్లాడుతూ అమిత్ షా పార్లమెంట్లో పదేపదే అంబేద్కర్ పేరు ఎందుకు జపిస్తారు దేవుని పేరు జపిస్తే పుణ్యం వస్తదని చెప్పడం ఉద్దేశపూర్వకంగా అంబేద్కర్‌ను అవమానించడమే అని ఈ దేశ ప్రజలు దేవుని చూడలేదని ఈ దేశంలో ఉన్న 140 కోట్ల మంది ప్రజలకి ముఖ్యంగా మహిళల,మైనార్టీలకి,దళితులకు, బీసీలకి, దేశ ప్రజలందరికీ దేవుడు బాబాసాబ్ అంబేద్కర్ అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు బిసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు కుమారు సిపిఐ నగర నాయకులు రాముడు,రవి, రామంజి గౌడు బాబయ్య, కృష్ణ, శేషు, మల్లికార్జున, వీరయ్య, రబియా, మంజుల, లక్ష్మి, బీమా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా గోబ్యాక్

విశాలాంధ్ర - ఆదోని : భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా గోబ్యాక్ అంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుండి ప్రదర్శన నిర్వహిస్తూ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. సిపిఎం పట్టణ నాయకులు గోపాల్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న,సిపిఐ జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు అజయ్ బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎంకప్ప , సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న,నాయకులు గోపాల్, వీరేష్, నాగరాజు,వెంకటేష్, రామాంజనేయులు, వీరారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు వామపక్ష నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గోబ్యాక్.. గోబ్యాక్ అమిత్ షా

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ ఎమ్మిగనూరు పట్టణంలో వామ పక్ష పార్టీలు సిపిఐ సిపిఎం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ నందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్,సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పి ప్రసాద్ ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు రైతు సంఘం తాలూకా గౌరవాధ్యక్షులు కేసి జబ్బర్ పి.డి. యస్ యు జిల్లా కార్యదర్శి మహేంద్ర, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, కాజా, హుద్దూస్ రవికుమార్, రాజన్న, ఆనంద్ ,అగస్టీన్, ఇస్మాయిల్ మహబూబ్ బాషా,ఎల్లప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

విశాలాంధ్ర - ఆలూరు : పార్లమెంట్ సమావేశాలలో భారత రాజ్యాంగ నిర్మాణ నేత బిఆర్ అంబేద్కర్ అవమానించే విధంగా మాట్లాడినందుకు, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని, సిగ్గు లేకుండా రాష్ట్రంలో పర్యటించడం రాష్ట్ర ప్రజలను అవమాన పరచడమేనని హెూం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఐ,సిపిఎం ఆధ్వర్యంలో ఆలూరులో ఆదివారం అంబేద్కర్ సర్కిల్లో నిరసన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు. కె.భూపేష్, సిపిఎం పార్టీ కన్వీనర్ హనుమంతు, సిపిఐ, చాపలు గోపాల్, ఎస్ఎస్ భాష, సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్దలింగ, వన్నూరు స్వామి, ఉలింగప్ప, సిపిఎం నాయకులు కృష్ణ, వెంకటేశ్వర్లు, మైన, ఈశ్వర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

పంట పొలలే పేకాట కేంద్రాలు..!

విశాలాంధ్ర - దేవనకొండ : మండలంలోనే తదితర గ్రామాల పరిధిలో వ్యవసాయ భూములు, పల్లెల శివారుల్లోని నిర్జీవ ప్రాంతాలు పేకాటకు అడ్డాగా మారుతు న్నాయి. మండల పరిధిలోని నెలతలమరి, పి.కోటకొండ, తెర్నెకల్, గుండ్లకొండ, గుడిమిరాళ్ల, వెంకటాపురం, మాచపురం, ఈ దూల దేవరబండ, కప్పట్రాళ్ల,కరివేముల, తదితర గ్రామాల చేరువలో ఉన్న శివారు ప్రాం తాల్లో ఇటువంటి పేకాట అడ్డాలున్నాయి అంటూ మండల ప్రజానీకం చర్చించుకుంటున్నారు. జనవాసాలకు దూరంగా ఉండే మామిడి తోటలు, పంట పొలాలు, చెరువు గట్టులు, వంకలు, వాగుల ప్రాంతాలను వేదికగా చేసుకొని జూదా న్ని కొనసాగిస్తున్నారు అని ఇందుకు ప్రత్యేక వ్యక్తులను నియమించుకుంటు పేకాట రాయుళ్లకు భోజనం, మం దును కూడా అందిస్తు నిర్వాహకులు స్థావరం ఏర్పాటు చేసిన ప్రాంత సమాచారాన్ని పేకాట రాయుళ్లకు రహస్యంగా అందిస్తున్నారు అంట. ఎవరూ గుర్తించకుండా అడ్డాలు మారుస్తూ పేకాటను నిర్వహిస్తు. పేకాట స్థావరాల వద్దకు ఇతరులు ఎవరైనా వస్తే ముందస్తుగా సమాచా రం ఇవ్వడానికి సెంట్రీలను ఏర్పాటు చేసుకుంటు పేకాట ను కొనసాగిస్తారు అంట పలు సార్లు పోలీస్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసిన పేకాట రాయుళ్ల తగ్గిదే లేదు అన్నట్లుగా ఉంది.

ఎంతటి వారైనా కేసులు నమోదు చేస్తాం...

సీఐ వంశీనాథ్, దేవనకొండ

మండలంలో ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లు సమాచారం వస్తే కచ్చితంగా దాడులు చేసి వారి పై కేసులు నమోదు చేస్తాం జూదం ఆడుతున్న సమాచారం అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం అని తెలిపారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : మండలంలోని బైచిగేరి గ్రామంలో సర్పంచ్ మహాదేవ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ కర్నూలు వారి సంయుక్త సౌజన్యంతో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె వ్యాధి తో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. బిపి,షుగర్, ఈసీజీ,టుడి ఎకో,ఉచిత కన్సల్టేషన్ వంటి సదుపాయాలు కల్పించడంతో గ్రామం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. ముందు ముందు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో కర్నూలు కిమ్స్ గైకాలజిస్ట్ వైద్యులు,ఎంపీటీసీ నాగభూషన్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

విశాలాంధ్ర - తుగ్గలి : మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్వాడి కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన వారు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని పత్తికొండ సి డి పి ఓ లలిత తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తుగ్గలి మండలంలోని బొందిమడుగుల (1) లో అంగన్వాడి కార్యకర్త పోస్టు, జొన్నగిరి తండా, జొన్నగిరి(4), జి,జీ.రాళ్ల, శభాష్ పురం, బొల్లావాని పల్లె గ్రామాలలో అంగన్వాడి ఆయా పోస్టులో ఖాళీగా ఉన్నాయని అందువల్ల అర్హులైన వారు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలు పత్తికొండ ఐసిడిఎస్ ఆఫీసులో అధికారులు ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

సంరక్షణ ఫెర్టీ9 ఫెర్టిలితోనే సాధ్యం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : అసాధారణ సంతానోత్పత్తి సంరక్షణ ఫెర్టీ9 ఫెర్టిలితోనే సాధ్యమని ఆ సంస్థ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి సి బుడి పేర్కొన్నారు. ఆదివారం కర్నూలులో అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఫెర్టిలిటీ కేర్‌ను ఫెర్టీ తెచ్చిందని ఫెర్టీ9 కర్నూలులోని ఐవిఎఫ్ కన్సల్టెంట్ డాక్టర్ సుశ్రుత తెలిపారు. ఈ మేరకు వారు నూతన సెంటర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలో సంతాన ఉత్పత్తి సంరక్షణ కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అను గుణంగా అవసరాలు తీరుస్తూ కొత్త సదుపాయం తమ ఇంటికి చేరువ లోనే అత్యాధునిక సాంకేతికతలు, చికిత్స పొందేలా చేస్తుందన్నారు. నైపుణ్యం కలిగిన సంతానోత్పత్తి నిపుణులు, సలహాదారుల బృందం మద్దతుతో ఈ కేంద్రం సంపూర్ణమైన వ్యక్తిగతీకరించిన సంరక్షణను అందిస్తుందన్నారు. మేము జంటలను ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేలా చేయడం, తల్లిదండ్రులుగా మారాలని వారి కలను సాగరం చేసుకునేందుకు ఉత్తమ అవకాశం అందించడమే లక్ష్యంగా పెట్టు కున్నామన్నారు. వారి ఆశలు, కొత్త ప్రారంభాలకు ఇదొక చక్కటి నిదర్శనం అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని కుటుంబాలను ఆదుకునే మా మిషన్ లో మరో మైలురాయిని కర్నూలు కేంద్రం సూచిస్తుందని చెప్పారు. సాటి లేని సాంకేతికత, శ్రేష్టమైన మా నిబద్ధతతో మేము కేవలం కుటుంబాలను నిర్మించడం మాత్రమే కాకుండా భవిష్యత్తును రూపొందిస్తున్నామని వారు గర్వంగా తెలిపారు. ప్రతి ఒక్కరి మాతృత్వ ప్రయాణంలో విజయవంతం కావడానికి అవసరమైన మద్దతు అందిస్తున్న వారు స్పష్టం చేశారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణా కేంద్రానికి స్థలం విరాళం

విశాలాంధ్ర - వెల్దుర్తి : వెల్దుర్తిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణా కేంద్రం నిర్మాణం కోసం వ్యాపారవేత్త ప్రశాంత్ కుమార్ 18 సెంట్లు స్థలాన్ని విరాళంగా అందించారు. ప్రశాంత్ కుమార్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు రామమూర్తి 20 ఏళ్ల కిందట క్యాన్సర్ తో ఇబ్బంది పడ్డారు. అయితే బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో సుదర్శన క్రియ, మెడిటేషన్ కోర్సు సాధనతో క్యాన్సర్ను జయించారు. ఇందుకోసం ఎంతోమంది అనారోగ్యాలకు,యువతకు ఉపయోగకరంగా ఉండటం కోసం వెల్దుర్తిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ శాశ్వత శిక్షణా కేంద్రం ఏర్పాటుకు 44వ జాతీయ రహదారి సమీపంలోని తొగర్చేడు రహదారిలోని తన స్థలాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో బెంగళూరులోని అంతర్జాతీయ ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యాలయానికి వెళ్లి భారతదేశ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీని కుటుంబ సభ్యులతో కలిశారు. రూ 40 లక్షల స్థలాన్ని అందించడంతో ప్రశాంత్ కుమార్ కుటుంబ సభ్యులను గురూజీ అభినందించారు. స్థలం కేటాయింపు అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణా కేంద్రాన్ని నిర్మాణం చేపట్టి శాశ్వతంగా ట్రైనీని ఏర్పాటు చేస్తామని గురూజీ తెలిపారని వారు పేర్కొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి సైతం స్థల పరిశీలన చేస్తారని అన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - హెూళగుంద : మండలంలోని గజ్జెహళ్లి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బి.వీరపాక్షికి వైసీపీ నాయకులు ఎంపిటిసి మల్లికార్జున, కేంచప్ప, శేషప్ప, భీమ లింగ కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వైకాపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలపై చర్చించారు. గ్రామంలో త్రాగు నీరు, సిసి రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్ తో పాటు ప్రజా సమస్యలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బి.విరుపాక్షి మాట్లాడుతూ గ్రామ సమస్యల తోపాటు గ్రామాభి వృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

చౌక డిపో డీలర్ మృతి

విశాలాంధ్ర - హెూళగుంద : మండలంలోని నేరనికి తాండ ప్రభుత్వ చౌక డిపో డీలర్ హీర్యా నాయక్ (70) ఆదివారం మృతి చెందారనీ మృతుని కుమారుడు దాక్య నాయక్ తెలిపారు. అనారోగ్యం వలన వైద్య చికిత్స కోసం అనంతపూర్ ఆస్పత్రిలో చేర్పించామని కోలుకోలేక మరణించారని అన్నారు. డీలర్ మృతి పట్ల నేరనికి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. డీలర్ హీర్యా నాయక్ మృతదేహానికి టిడిపి నాయకులు, సర్పంచ్ పార్వతి బాయ్, ఎంపీటీసీ సంధ్య భాయి, మండలంలోని డీలర్లు, రెవెన్యూ అధికారులు, బంధుమిత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ చౌక డిపో డీలర్ గా పని చేస్తూ ప్రజలకు నిత్యవసర సరుకులు సకాలంలో అందించి ప్రజల మన్ననలు పొందారని పలువురు కొనియాడారు. డీలర్ మృతితో కుటుంబ సభ్యులు బోరున ఏడ్చారు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడుగా ఉంటూ పార్టీకి అండదండగా నిలిచారని పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారని టిడిపి నాయకులు కొనియాడారు. మృతుని కుటుంబానికి డీలర్ గా ఎంపిక చేయాలని చేసారు. మృతుని కుమారుడు వెంకటేష్ నాయక్ సీఐగా అనంతపురంలో విధులు నిర్వహిస్తున్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : స్థానిక బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం నాడు ప్రజాకవి యోగి వేమన జయంతి సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ యస్. నాగస్వామి నాయక్ అధ్యాపకులు వేమన చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. వేమన ప్రజాకవి,సంఘ సంస్కర్త అని, పామరులకు కూడా బాగా అర్థం అయ్యే భాషలో పద్యాలను చెప్పి ప్రజలను మెప్పించిన తాత్విక వేత్త అని, "విశ్వదాభి రామ వినుర వేమ" అనే పద్యాలతో తెలుగు వారి మదిలో నిలచిన చిరస్మరణీయుడు యేగి వేమన అని ప్రిన్సి పల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేశ్ ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కదలిన వలసల బండి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గ్రామాలలో పనులు లేక పల్లె పొమ్మంటుంది పట్నం రమ్మంటుంది అంటూ వ్యవసాయ కూలీలు పిల్లా పాపలతో మూటా ముల్లె సర్దుకొని మండల పరిధిలోని పీకలబెట్ట, ముచ్చిగిరి గ్రామాల్లో ఆదివారం గుంటూరుకు వలస వెళ్లారు. ముచ్చిగిరి గ్రామం నుంచి 100 మంది కూలీలు ఉపాధి పనుల కోసం వలస బాట పట్టారు. అలాగే పీకలబెట్ట గ్రామంలో పనులు లేక ఉపాధి కరువై బ్రతుకు తెరువు కోసం గుంటూరు పరిసర ప్రాంతాల్లో పత్తి, మిరప పంట తీయడానికి కూలీలు లారీలో వలస వెళ్లారు. పీకలబెట్ట గ్రామ ఒడిలో పులికనుమ ప్రాజెక్టు ఉన్నప్పటికీ ఇక్కడి రైతులకు చుక్క సాగునీరు అందడం లేదు. వలసలతో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నా సంబంధిత అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలలో ఉపాధి హామీలో పనులు కల్పించి వలసలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కర్నూలు-బళ్ళారి నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాల్సిందే..
వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో

విశాలాంధ్ర - కోడుమూరు : కర్నూలు-బళ్లారి నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని వామపక్ష పార్టీలైన సిపిఐ,సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కేవలం 15రోజుల్లో రోడ్డు ప్రమాదాల వల్ల కోడుమూరు పట్టణానికి చెందిన పలువురు ప్రాణాలు కోల్పోయారని,రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నిధులు కేటాయించి,నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ ఆదివారం స్థానిక కోట్ల సర్కిల్ వద్ద వామపక్ష పార్టీల నాయకులు సిపిఐ మండల కార్యదర్శి రాజు,సీనియర్ నాయకులు దూళ్ళ భాస్కర్, ఏఐటియుసి నాయకులు రాముడు,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి,సిపిఎం మండల కార్యదర్శి కామార్తి రాజు,సిపిఎం నాయకులు బజ్జీల ఈరన్న,గఫార్ మియా తదితర ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు,కార్యకర్తలు, ప్రజలందరూ పెద్దఎత్తున రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కర్నూలు- కోడుమూరు మధ్య నున్న పెంచికలపాడు గ్రామం వద్ద నుంచి కొత్తూరు, ప్యాలకుర్తిల మీదుగా కోడుమూరు వరకు ఉన్న రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ రోడ్డు ప్రమాదాల్లో కొందరు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, చాలామంది తమ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే ప్రమాదాలకు ముఖ్య కారణం కర్నూల్ నుంచి కోడుమూరు మీదుగా పత్తికొండ,ఆలూరు,బళ్లారి పట్టణాలతో పాటు ఎమ్మిగనూరు,ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలకు వెళ్లే వాహనాల ట్రాఫిక్ రద్దీగా ఉండడమేనని తెలిపారు. నిత్యం భారీ లోడ్లతో పెద్దపెద్ద వాహనాలు తిరుగుతుంటాయని,అలాగే మంత్రాలయం, ఉరుకుంద పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులతో నిత్యం ట్రాఫిక్ ఉంటుందని చెప్పారు. ఇలాంటి ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా మార్చి, త్వరితగతిన కర్నూలు-బళ్లారి రహదారి నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి,నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టకపోతే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు,ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టే వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అన్ని ప్రజాసంఘాల నాయకులు,కార్యకర్తలు కలుపుకొని, ప్రజలందరినీ సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలి వర్కర్స్ యూనియన్,ఆటో వర్కర్స్ యూనియన్,డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 20, జనవరి 2025

దీర్ఘకాలిక జబ్బులకు మందుల పంపిణీ

దివ్యాంగుల సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తాం డాక్టర్ రవికృష్ణ..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఇరవై మంది దివ్యాంగులకు నెలవారి అవసరమైన 15 వేల రూపాయల విలువచేసే మందులను నంద్యాల ఐఎంఏ వైద్యుల సహకారంతో పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు భార్గవర్ధన రెడ్డి, తారకేశ్వర రెడ్డి, పెసల అశోక్, పాండురంగారావు అతిథులుగా పాల్గొని దివ్యాంగులకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులకు దీర్ఘకాలిక జబ్బులకు ప్రతినెల అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తామని, భవిష్యత్తులో ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగిస్తామన్నారు. వైద్యులు మాట్లాడుతూ దివ్యాంగుల సేవా కార్యక్రమాలకు తమ సహకారం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులను నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యక్రమాల సమన్వయకర్త ఎంపీవి రమణయ్య, కార్యాలయ కార్యదర్శి మధు, దివ్యాంగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రజక కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి...

విశాలాంధ్ర - కోసిగి : రజక కులస్తులు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలని రజక కార్పొరేషన్ చైర్పర్సన్ సావిత్రి అన్నారు. ఆదివారం కోసిగి లో ఉన్న ధోబి గాట్లను పరిశీలించారు. అదేవిధంగా పెద్ద తుంబళం ,ఆదోని , ఎమ్మిగనూరు మండలాల్లో ఉన్న ధోబిగాట్లను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోసిగి మండలంలో దాదాపు 2000 నుండి 3000 జనాభా కలిగి ఉన్నారని రజక వృత్తిని రెండు వేల మంది చేస్తున్నారన్నారు. రజక వృత్తిని చేసే వారికి సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి రావడంతో ఆ సమస్యను పరిష్కరించేందుకు కూటమి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. 2014 వ సంవత్సరంలో ధోబి గాట్ల నిధులు కేటాయించారు. వాటి నుండి నేటి వరకు నిధులు కేటాయించలేదన్నారు.ప్రస్తుతం ఉన్న ధోబిఘాట్లో పూర్తిగా నిరుపయోగంగా మారి నీళ్లు లేక ముళ్ళ పొదల మధ్య అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుగా మారి శిథిలావస్థకు చేరాయన్నారు. బీసీ కులస్తుల్లో భాగంగా బీసీ కార్పొరేషన్ నుండి రజకులస్తులకు తోడ్పడి వారి అభివృద్ధికి కృషి చేయాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రజక కులస్తుల్లో కూడా చాలామంది చదువుకున్న విద్యావంతులు ఉన్నారని ,వారిని దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి , వారికి తోడ్పాటు అందిస్తామన్నారు.మోడ్రన్ ధోబి గాట్లను ఏర్పాటు చేసి ఆర్థికంగా వారిని అభివృద్ధి పరస్థామన్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు మండల స్థాయిలో ఉన్న ఆయా శాఖల అధికారులకు తమ కులస్తుల్లో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేసి పరిష్కరించే విధంగా చేస్తామన్నారు.రజక కులస్తులు అందరూకలిసికట్టుగా ఉండి ప్రస్తుతం ఉన్న ధోబిగాట్లను అందంగా సుందరంగా తీర్చిదిద్ది స్వచ్ఛ ధోబి ఘాట్లుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. రజక కులస్తులు అందరూ ఐక్యంగా ఉండి ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రజక కులస్తులు బసన్న , వేమారెడ్డి , ఈరన్న , విరుపాక్షి , మూర్తి , శివ , విజయ్,వీరేష్,రాము, దస్తగిరి, మనోజ్,అల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద మండల కేంద్రం, కొగిలాతోటలో ఆదివారం ఘనంగా కాగినేలే మహా సంస్థ నా కనక గురు పీఠాధిపతి జగద్గురు శ్రీ నిరంజనందపురి స్వామి వారి క్యాలెండర్ కే యంసిద్దు స్వామి వారి సేవకులు కురువకుల పెద్దలు ఆవిష్కరణచేయడం జరిగినది, కార్యక్రమంలో మాదాసి కురువ సంఘం ఆలూరు తాలూక ప్రధాన కార్యదర్శి మల్లయ్య.జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భర్త ఎల్లప్ప,బావ శేషప్ప, లింగప్ప,హొళగుందా మండలం మాదాసి కురువ సంగం అధ్యక్షులు పంపాపతి, సంగం సలహాదారుడు గాదిలింగ,కర్లింగ, గదిలింగ, నాగప్ప,వీరేష,తరుణ్,మార్చేడీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఏర్పడ్డ అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీ నియమకానికి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఉమామహేశ్వరి ఆదివారం మీడియాకు ప్రకటన ద్వారా తెలిపారు.ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని హవన్నపేట సెంటర్-1(ఈబీసీ),హావన్నపేట సెంటర్ -2 (ఓసి),బోయగిరి సెంటర్-2(ఓసి),నిజాముద్దీన్ సెంటర్-1(ఓసి), రూరల్ పరిధిలో సుల్తాన్పురం(ఓసి), పాండవగల్ పరిధిలో (బిసి-ఏ), కుప్పగల్ సెంటర్-3 (ఓసి), పెద్ద తుంబలం సెంటర్-3(ఈబిసి), మదిరి సెంటర్-2(ఎస్టి),పెద్ద హరివనం సెంటర్-8(ఓసి),సాదాపురం సెంటర్-2(బిసి-బి),ఆరెకల్ సెంటర్-2 (ఓసి) సంబంధించిన అంగన్వాడి కేంద్రాలలో దరఖాస్తులను ఆహ్వానం కోరడం జరిగిందన్నారు. అర్బన్ అంగన్వాడీ కేంద్రానికి తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అంత కుమించి ఎక్కువ విద్యార్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 1-ఆగస్ట్-2024 నాటికి 21 సంవత్సరం నుండి 35 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులు అన్నారు. అభ్యర్థులు వివాహితులై, స్థానికులై ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఎస్సీ,ఎస్టీ కులాలలో 21 సంవత్సరాలు పైబడిన అర్హులు లేకపోతే 18 సంవత్సరాల నిండిన అభ్యర్థులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. పైన తెలిపిన నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులు బర్త్ సర్టిఫికెట్,కుల ధ్రువీకరణ పత్రము, విద్యార్హత ధ్రువీకరణ పత్రము (10వ తరగతి మార్కు లిస్ట్),టి.సి, నివాస ధ్రువపత్రము తో పాటు భర్త మరణించినట్లయితే మరణ ధ్రువపత్రము, వికలాంగుల అభ్యర్థుల అయితే పీహెచ్ ధ్రువ పత్రము, 18 సంవత్సరాలు నిండిన పిల్లలు ఉన్నచో పిల్లల వయస్సు ధ్రువీకరణ పత్రము, ఆధార్ కార్డు,రేషన్ కార్డు జతపరిచాల్సి ఉంటుందని విజ్ఞప్తి చేశారు. సంబంధించిన ధ్రౌపత్రాలను జతపరిచి సిడిపిఓ కార్యాలయమునకు 20జనవరి2025 నుండి 28జనవరి2025 సా,,గం,,5లలోపు సమర్పించాలని కోరారు. సంబంధించిన నోటిఫికేషన్ కు సవరించుట లేదా రద్దు చేయుట శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి అర్హత ఉంటుందని అర్హులైన అభ్యర్థులు గమనించాలన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : మండలంలోని బైచిగేరి గ్రామంలో సర్పంచ్ మహాదేవ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ కర్నూలు వారి సంయుక్త సౌజన్యంతో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. బిపి,షుగర్, ఈసీజీ,టుడి ఎకో మరియు ఉచిత కన్సల్టేషన్ వంటి సదుపాయాలు కల్పించడంతో గ్రామం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. ముందు ముందు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో కర్నూలు కిమ్స్ గైకాలజిస్ట్ వైద్యులు,ఎంపీటీసీ నాగభూషన్ రెడ్డి పాల్గొన్నారు.

కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి పరామర్శించిన మంత్రి



విశాలాంధ్ర- బనగానపల్లె: హైదరాబాద్లో అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న డోన్ శాసనసభ్యులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిని పరామర్శించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కోట్ల ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి పూజలు

విశాలాంధ్ర - పాణ్యం : ప్రముఖ సేవ క్షేత్రం పాణ్యం మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి విశ్వనాథ్ కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించి ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నారాయణస్వామి, సురేష్ స్వామి,ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామి వారి అభిషేకములు అర్చనలు విశేష పూజలు నిర్వహించి శేష వస్త్రములతో ఘనంగా సన్మానించి ప్రసాదము వితరున చేశారు ఈ కార్యక్రమంలో వీఆర్వో జయరాముడు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావ్య గీతాలు హిప్-హాప్ తోనే సాధ్యం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : శ్రావ్య గీతాలు హిప్-హాఫ్ తోనే సాధ్యమని ప్రముఖ కళాకారులు అర్మాన్ మాలిక్, అమిత్ త్రివేది, నీతి మోహన్ నిఖిత గాంధీలు పేర్కొన్నారు. హిప్-హాప్ బీట్స్ తో సమకాలీన బాలీవుడ్లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన గీతాల మిశ్రమంగా వారు అభివర్ణించారు. ఇది రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ తిరిగి పరిచయం చేస్తున్నట్లు సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్తీక్ మొహీంద్రా, పేర్నాట్ రికార్డ్ ఇండియాలో లోబర్ బిజినెస్ డెవలప్మెంట్ లు ఇలా అభి వర్ణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "ప్రజలను ఐక్యం చేయడానికి మరియు స్వచ్ఛమైన మేజిక్ యొక్క లక్షణాలను సృష్టించడానికి మ్యూజిక్ యొక్క విశ్వ జన నీయ భాషను ప్రత్యేకించి లైవ్ అనుభవాలు ఈ విశేష మైన శక్తిని కలిగి ఉందన్నారు. రాయల్ స్టాగ్ యువతకు మ్యూజిక్ను తమ కీలకమైన అభివృద్ధి మూల స్తంభంగా సంబరం చేయడం కోసం కొనసాగిస్తూ ఉందని చెప్పారు. మూడో ఎడిషన్ విడుదల చేస్తున్న సందర్భంలో ఉత్తేజ భారీత మైన కొత్త సౌండ్ స్కోప్తో అనుభవాన్ని పెంచ దానికి సిద్ధంగా ఉందని దక్షిణా సియా సీఈవో అజయ్ గుప్త స్పష్టం చేశారు. " లీవ్ ఇట్ లార్డ్ సిద్ధాంతాన్ని రాము విస్తృతం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఫెస్టివల్ ను 4 ప్రధాన యువ కేంద్రాలు హైదరాబాద్, ముంబాయి, గురు గ్రామ్, గౌహతిలో ఆధునిక పరస్పర ప్రతిచర్య అనుభవాలతో పాటు ప్రధాన మైన సంగీత కార్యక్రమాలను ప్రదర్శిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు సంగీత ప్రియుల్ని ఆకర్షించిందని అన్నారు. డిజిటల్ ప్లాట్ ఫాంలో 200 మిలియన్ పైగా వ్యూస్ ఉత్పన్నం చేశాయని గుర్తు చేశారు. ఏఐ మద్దతుతో వ్యక్తిగత సందేశాలు పంపించడం వంటి వాటిల్లో పాల్గొనవచ్చు. ప్రముఖ స్థానిక కళాకారులచే ప్రదర్శనలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. యువత పోకడలు, క్రీడలు, వినోదం యొక్క కూడలిని గుర్తించడంలో తన నైపుణ్యాన్ని వినియోగించి గేమింగ్ ఇన్ ఫ్లియన్సర్స్ బృందం రూపొందించ బడిందని వివరించారు.

మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రి భాయి పూలే

స్త్రీ అక్షర జ్యోతి మహిళా దిక్సూచి..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : దక్షిణాది ప్రైవేటు ఉపాధ్యాయులు అధ్యాపకుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు నంద్యాలకు చెందిన బాల అకాడమీ విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభావంతురాలుగా గత 20 సంవత్సరాలుగా బాల అకాడమీ విద్యా సంస్థ ప్రధాన ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ ఉత్తమ నాణ్యత, ఆధునికతో కూడిన విద్యా విధానాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు. సృజనాత్మకతతో కూడిన విద్యను మొదటిసారిగా ప్రారంభించి కొనసాగిస్తూ సాధారణ ప్రతిభ కలిగిన విద్యార్థులు సైతం మొదటి ర్యాంకులు తెచ్చేలాగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యార్థులను అత్యున్నత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఆమె చేస్తున్న నిర్విరామకృషిని సేవలను, అంకిత భావాన్ని స్ఫూర్తిని గుర్తించిన దక్షిణాది ప్రైవేటు ఉపాధ్యాయుల ఆర్గనైజేషన్ నిర్వాహకులు గుంటూరులో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు చేతుల మీదుగా సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డును మాధవీలత అందుకోవడం జరిగినది. ఈ కార్యక్రమం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నందు నేడు దక్షిణాది రాష్ట్రాల నుండి సెలెక్ట్ చేసిన ఉత్తమ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ప్రారంభమైన యాగంటి శివదీక్షలు

దీక్ష స్వీకరించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామి శివదీక్ష మాలధారణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శివ భక్తులు ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలదీక్ష (41 రోజులు) పాటించి మహ శివరాత్రికి దీక్ష విరమిస్తారు. స్వతహాగా శివ భక్తుడైన కాటసాని రాంభూపాల్ రెడ్డి శివ మాల దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా శివ భక్తులు పెద్ద ఎత్తున శివ మాల దీక్ష స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యాగంటి దేవస్థానం ఈవో బి.చంద్రుడు, శ్రీ ఉమామహేశ్వర నిత్యాన్నదానసత్రం ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, కోశాధికారి వై రామారెడ్డి, పాతపాడు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ప్రధాన పూజారి మహేశ శర్మ, దేవేంద్ర శర్మ, లోకనాథ శర్మ, రాఘవేంద్ర శర్మ సత్యనారాయణ శర్మలు పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ సయ్యద్ మునీర్ భాష ఉరుసు



విశాలాంధ్ర - తుగ్గలి : మండల పరిధిలోని నల్ల గుండ్ల గ్రామంలో ఆదివారము హజరత్ సయ్యద్ మునీర్ భాష (ముని స్వామి) ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ ఉరుసుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ హాజరు అయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్,సర్పంచ్ గౌరవ సలహాదారుడు నునసారాళ్ళ గోపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ రంగారెడ్డి,నీటి సంఘం అధ్యక్షులు నునసారాళ్ళ రామాంజనేయులు, స్థానిక తెలుగుదేశం నాయకులు దేవదాసు గౌడు, మహేష్ గౌడు, మునీశ్వర్ గౌడు, తదితరులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు కూసినేని రవి, కుషినేని శేఖర్ లు వారికి స్వాగతం పలికారు.అలాగే వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు దర్గాను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ము వెంకటేష్, తిరుపాల్ నాయుడు, వెంకట్రామ చౌదరి, బర్మా వీరేష్, ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడు, మారెళ్ళ ఈడిగ వెంకట రాముడు, రాంపల్లి శ్రీనివాసులు, గిరిగేట్ల సత్య ప్రకాష్, బొందిమడుగుల మోహన్, ప్రతాప్ యాదవ్, లింగనేని దొడ్డి రాముడు, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘ అధ్యక్షునిగా కోట్రీకే హరికిషన్

విశాలాంధ్ర-డోన్ రూరల్ : ఆర్య వైశ్యుల సంఘ అధ్యక్షునిగా కోట్రికే హరికిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రోజు ఆర్యవైశ్య సంఘం ఎలక్షన్ కమిషన్ చైర్మన్ కొట్రికె వెంకట ఫణిరాజ్ , సభ్యులు మురారి నరసింహయ్య జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ఎలెక్షన్స్లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా కొట్రికె హరి కిషన్, యువజన సంఘం అధ్యక్షునిగా కామిశెట్టి విద్యా సాగర్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఫణి రాజ్ తెలిపారు. ఎన్నుకోబడిన వారి పదవి కాలం 3సంవత్సరాలు ఉంటుందని వీరు త్వరలో నూతన బాడీని ఏర్పాటు చేసుకున్న అనంతరం వీరి ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేశామన్నారు.ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ ఆర్య వైశ్యులకు ఏ కష్టం వచ్చినా ముందుండి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో ఆర్య వైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

24 నుండి క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని బుగ్గ రస్తాలో గల రజమ్మ గారి క్రీడా మైదానంలో ఈ నెల 24 నుండి నియోజకవర్గ స్థాయి హార్డ్ టెన్నిస్బాల్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అల్తాఫ్,రఫిలు తెలియజేసారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు టిడిపి నాయకులు ఆలంసాగారి హనీఫ్,రెండవ బహుమతి రూ.10 వేలు తౌఫీద్, పెయింటర్ ముస్తాక్లు,మూడవ బహుమతి రూ.5 వేలు సలీంలు అందజేస్తారన్నారు.ఈ పోటీలలో పాల్గొనదలచుకున్నవారు ఈ నెల 23 లోపు తమ టీమ్లను నమోదు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 6301659818, 9398523698 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కురువ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం నందు కురువ సంఘం పట్టణ కమిటీ అధ్యక్షులు కైప విజయకిరణ్, ప్రధాన కార్యదర్శి కల్లే విజయకుమార్, కమిటీ సభ్యులు కురువ సంఘం 2025 సంవత్సరం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కైప విజయ కిరణ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం నంద్యాల పట్టణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, గత రెండు సంవత్సరాలుగా వనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తూ కురువ సంఘంలో పదవ తరగతి నందు 500 మార్కులు పైన, ఇంటర్ నందు 900 మార్కులు పైన వచ్చిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంకల శ్రీరాములు, కైప హరినాథ్ బాబు, కురువ సోమశేఖర్, కురువ మద్దిలేటి, సంకల వెంకటసుబ్బయ్య, బన్నూరు నారాయణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని గజ్జెహళ్లి గ్రామాభివృద్ధి కి సహకరించాలని ఎమ్మెల్యే బి వీరపాక్షికి వైకాపా నాయకులు ఎంపిటిసి మల్లికార్జున, కేంచప్ప, శేషప్ప, భీమ లింగ కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వైకాపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలపై చర్చించారు. గ్రామంలో త్రాగు నీరు, సిసి రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్ తో పాటు ప్రజా సమస్యలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బి విరుపాక్షి మాట్లాడుతూ గ్రామ సమస్యల తోపాటు గ్రామాభి వృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైకాపా నాయకులు ఆంజనేయులు, శివలింగ, ఆనంద్ రాజ్, రామ్ లింగ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు



విశాలాంధ్ర - చాగలమర్రి : పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి 31 వరకు గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక పశువైద్యశాల లో ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా లేగ దూడలకు పాముల మందు, పశువులకు జలగ మందు, గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందు, పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అందించనున్నామన్నారు. ఈ మండలంలోని మొత్తం గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ నెల 20 న మండలం లోని పెద్దబోధనం గ్రామంలో వైద్యాధికారి సాయిబాబా,చిన్నవంగలిలో వైద్యులు దీపాకుమారి ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పశువైద్యులతో కూడిన రెండు బృందాలు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి సేవాలందిస్తారన్నారు. గ్రామ స్థాయి పశు వైద్య సిబ్బంది ద్వారా ఇప్పటికే పశుపోషకులు, పాడిరైతులకు తెలియజేశారని అన్నారు. పాడి రైతులందరూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలద్వారా తమ పశువులకు తగిన వైద్య సేవలు పొందవలసిందిగా కోరుతున్నామన్నారు.